## సీతాగోంది బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నర్సింగ్



ఎన్నికైన బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు

గుడిహత్నూర్, జనవరి 22 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాడే నర్సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీతాగోందిలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిచారు. ఉపాధ్యక్షుడిగా తెలంగ్ ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా కానిందే గోవింద్, ప్రచార కార్యకర్తగా హర్షవర్ధన్, సలహాదారుడిగా బేర దేవన్న, సభ్యులుగా పాటిల్ రాందాస్, సంతోష్‌గౌడ్, కైలాస్, మునేశ్వర్‌సాయి, హన్మాండ్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అరుగుల సంతోష్‌గౌడ్. మాజీ ఎంపీటీసీ బేర దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్‌కార్డు ఉద్యమం

ఎదులాపురం, జనవరి 22 : దేశ పౌరులకు రాజ్యాంగ విలువలు తెలియకుండా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహారాజ్ అన్నారు. లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌లోని పోస్టాఫీస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజు రాజ్యాంగంతో పాటు అంబేద్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యాసంస్థల్లో భారత రాజ్యాంగ పీఠికను చదివించాలన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, అదిలాబాద్ జిల్లా నాయకులు అడెల్లు, వెంకటేశ్, రాజేశ్వర్, సంతోష్, గణేశ్, నవీన్, రమేశ్, సాయి, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

## సమీక్షా సమావేశం

బాసర, జనవరి 22 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే వసంత పంచమి ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తీసుకునే చర్యలపై బుధవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో ఎన్ నవీన్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్‌డీవో సమక్షంలో రెవెన్యూ, పోలీస్, ఫిషరీష్ ఫైర్ మెడికల్ అండ్ హెల్త్, ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ, ఇతర శాఖల ఉన్నతాధికారులతో సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ సేవలను వినియోగించుకోవాలి

భైంసా, జనవరి 22: ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం భైంసాలోని ఎస్పీ ట్రాన్సిట్ క్యాంపులో ఏర్పాటు చేసిన నిర్మల్ పోలీస్.. మీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అంతేగాకుండా ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్లకు ఫోన్ చేసి సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రతి బుధవారం ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ గోపీనాథ్, రూరల్ సీఐ నైలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల్లో లొల్లి..లొల్లి

- రెండో రోజు అదే తీరు
- గ్రామసభలను బహిష్కరించిన గ్రామస్తులు


జైనథ్: ఆనంద్‌పూర్ గ్రామసభలో ఆందోళనకు దిగిన ఎన్ఆర్ ఈజీఎస్ కూలీలు

ఇంద్రవెల్లి, జనవరి 22: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రవెల్లి(బీ), కేస్లాపూర్, మెండపల్లి, ముత్నూర్, గౌరపూర్, వాల్గొండా గ్రామ పంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలు తీవ్ర గందరగోళం మధ్య కొనసాగాయి. సంక్షేమ పథకాల గురించి ఇంద్రవెల్లి గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అక్కడే అందుబాటులో ఉన్న ఎస్ఐ సునీల్, అధికారులు కలిపించుకొని వాగ్వాదానికి దిగిన నాయకులను సముదాయించారు. భీంనగర్‌కు చెందిన చాటే ఉజ్వల తనకు నాలుగింటిలో ఏ పథకం మంజూరు జాబితాలో తమ పేరు రాలేదని గ్రామసభలో అధికారులకు వివరించింది. దీంతో స్పందించిన డీఆర్డీవో రాథోడ్ రవీందర్ ఆ మహిళ సమస్యలు విని తన డైరీలో నమోదు చేసుకున్నారు. జాబితాలో పేర్లు లేని ప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి జాబితాలో పేర్లు రాని ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, ఏవో గణేశ్, ఏపీవో శ్రీనివాస్, ఈవో సంజీవరావ్, టీపీ మహేందర్, ఏఈవో వీర, నాయకులు పాల్గొన్నారు.

### రుణమాఫీకి రైతుల దరఖాస్తు

భీంపూర్, జనవరి 22 : భీంపూర్ మండలం గోముత్రి గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో సర్కారు సూచించిన నాలుగు పథకాలు అమలులో ఉంచితే రుణమాఫీ గురించి రైతులు అసహనం వ్యక్తం జేశారు. తమకు ఇంకా రుణమాఫీ కాలేదని 55 మంది రైతులు సభలో వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవిస్తామని ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఏఈవో వికాల్ అన్నారు. సభ ఏదైనా సరే రుణమాఫీ గురించి ప్రశ్నిస్తూనే ఉంటామని , సర్కారును నిలదీస్తూనే ఉంటామని బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య, రైతులు చెప్పారు. గ్రామసభలో ఫ్లెక్సీలపై ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఫొటో లేకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ ఆర్ఐ రాందాస్, పంచాయతీ కార్యదర్శులు లోకేశ్, వినోద్, నర్సయ్య, రైతు నాయకులు నిమ్మ వేణు, బండి మల్లేశ్, గజానన్, గౌడి నారాయణ, రాకేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎదులాపురం, జనవరి 22 : ఆదిలాబాద్‌లోని వార్డు నంబర్ 10 రాంనగర్‌లో వార్డు సభ నిర్వహించారు. కాలనీ వాసుల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కౌన్సిలర్ తుర్పటి సుజాత భూమన్న, వార్డు ప్రత్యేకాధికారి సువర్ణ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత, ఆర్పీలు లక్ష్మి, వందన, మైనార్టీ నాయకుడు భూమన్న, సతీశ్‌యాదవ్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చోడ, జనవరి 22: జాబితాలో పేర్లు రాని లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ జడ్పీసీఈవో జితేందర్ అన్నారు. ఇచ్చోడ, కామగిరి, నర్సాపూర్, గుండాల, మాదపూర్, సాత్ నంబర్, జామిడి, ముక్రా(బీ) గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. మండల కేంద్రంలో జాబితాలో పేర్లు రాని లబ్ధిదారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వారి దరఖాస్తు కోసం ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఏఈవో కైలాస్, ఎంఈవో బిక్కు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీంపూర్, జనవరి 22 : భీంపూర్ మండలం బెల్సరిరాంపూర్, అర్లి(టీ), గోనా, గుబిడిపల్లి, కామట్‌వాడ, గోముత్రి, తాంసి(కే)లో నిర్వహించిన గ్రామసభల్లో కొన్ని చోట్ల జనం అంతగా కనిపించలేదు . అర్లి(టీ)లో భూమి లేని పేదలకు జాబ్‌కార్డు లేని కారణంగా రూ.12 వేలు లబ్ధి చేకూరే అవకాశం లేకుండా పోతున్నదని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు బొంత నితిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఉన్నతాధికారులకు విన్నవిస్తామని ప్రత్యేకాధికారి అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో ఓపాల కృష్ణారెడ్డి, డీటీ హరిదాస్, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, రాజలింగు, సుమీర్ అహ్మద్, సునీత, తిరుపతి, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సోన్: అక్కాపూర్‌లో అధికారులను తమ పేర్లు ఎందుకు రాలేదని అడుగుతున్న గ్రామస్తులు

బోథ్, జనవరి 22: బోథ్‌లో నిర్వహించిన గ్రామ సభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వాటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు, అర్హుల జాబితాను ఎంపీడీవో రమేశ్ చదివి వినిపించారు. అనంతరం పదేళ్ల పాలనను బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇళ్లు కట్టివ్వలేదని కాంగ్రెస్ నాయకులు అనడంతో ఒక్కసారి బీఆర్ఎస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. తమ పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ప్రస్తుతం పథకాల పేరుతో ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. సీఐ వెంకటేశ్వర్‌రావ్, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఇరువర్గాలను సముదాయించారు. సమావేశంలో ఏడీఏ శ్రీధర్ స్వామి, తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎంపీడీవో రమేశ్, ప్రత్యేకాధికారి వాజిద్ అలీ, ఏపీవో జగ్దేరావ్, వ్యవసాయ అధికారులు, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, జనవరి 22 : ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్, హస్నాపూర్, పులిమడుగు, కుమ్మరితండా, తాండ్ర, బాబాపూర్, కామయిపేట్, శ్యాంనాయక్‌తండా, బిర్సాయిపేట్, దంతన్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. శ్యాంపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో గుడిసెలు, పెంకుటిల్లు, రేకుల ఇండ్లు గల వారి పేర్లు రాలేదని నాయకులు, గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంపీవో సురేందర్ రెడ్డి రానివారు దరఖాస్తు చేసుకోవాలని వారికి కూడ మంజూరు అవుతాయని పలు మార్లు నచ్చజెప్పిన వినలేదు. ఇందిరమ్మ కమిటీలు, అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేసిన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అనంతరం సీఐ మొగిలి నచ్చజెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దావులే బాలాజీ, మాజీ సర్పంచ్‌లు మల్లిక, జాదవ్ జగదీశ్, నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

### పోలీసు పహారాలో గ్రామసభలు

నేరడిగొండ, జనవరి 22 : నేరడిగొండ మండలంలోని రాజురా, బోరిగాం, కుంటాల(కే), తర్నం(కే), బుద్దికొండ, లఖంపూర్, ఇస్పూర్ గ్రామాల్లో గ్రామసభలు పోలీసు పహారలో కొనసాగాయి. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాల అమలు చేయకపోవడంతో ప్రజలు ఎక్కడ ఆందోళన చేస్తారని ముందుగానే ప్రతి గ్రామసభ వద్ద పోలీసు అధికారులను నియమించారు.

తాంసి, జనవరి 22: తాంసి మండలంలోని గోట్కూరి గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఒక్కరిని మాత్రమే ఎంపిక చేశారని అర్హులను గుర్తించలేదని గ్రామస్తులు అధికారులతో వాపోయారు. అదేవిధంగా జామిడి గ్రామంలో దాదాపు 30 నుంచి 40 మంది అర్హులున్నప్పటికీ అనర్హులుగా గుర్తించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్ల కిందట ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాక మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణంపై అధికారులను ప్రశ్నించగా పట్టించుకోలేదు.

జైనథ్, జనవరి 22 : జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ కమిటీని గ్రామస్తులు, నాయకులు, రైతులు మహిళలు ఈజీఎస్ కూలీలు బహిష్కరించారు. రైతు భరోసా, ఎన్ఆర్ ఈజీఎస్ కూలీలకు 300 మంది ఉండగా 13 మందికి అవి భూములు ఉన్న వారికి రూ.12 వేలు చెల్లించడం తగదని గ్రామస్తులు మహాజాన్, సీహెచ్ సుభాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాధాసాయినాథ్ వ్యతిరేకించారు. గ్రామ ప్రత్యేకాధికారి వినోద్ దేశ్‌పాండేతో ఎస్ఐ వీ పురుషోత్తం ముందు గ్రామస్తులు, రైతు కూలీలు వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, టీపీ రాకేశ్, నాయకులు పరమేశ్వర్, గంభీర్, మాసం నర్సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖానాపూర్, జనవరి 22: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలోని 5, 6, 7, 8 వార్డుల్లో జరిగిన వార్డు సభలో అధికారులు అర్హుల జాబితా చదివి వినిపించగా పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికి పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం 20 శాతం మందికి మాత్రమే కొత్త రేషన్ కార్డులు ఇస్తూ చేతులు దులుపుకుంటుందని విమర్శించారు. ఇప్పటికైన పథకాలు వస్తాయా అంటూ ప్రజలు అధికారుల వద్ద దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కడెం, జనవరి 22: కడెం మండలంలోని అల్లంపల్లి, బాబానాయక్‌తండా, ధర్మాజీపేట, కన్నాపూర్, మైసంపేట, నవాబుపేట, పెద్దబెల్లాల్, సారంగాపూర్, ఉడుంపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు డీఆర్డీవో విజయలక్ష్మి హాజరయ్యారు. పెద్దబెల్లాల్‌లో ప్రజలు అధికారులతో గతంలో తీసుకున్న దరఖాస్తుల విషయమై అడగగా వాగ్వాదానికి దారి తీసింది. అలాగే కన్నాపూర్‌లో గతంలో తమకు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇప్పటికి ఇళ్లు ఇవ్వడం లేదని, ఎన్నిసార్లు ఇలా దరఖాస్తులు తీసుకుంటారని అధికారులపై మండిపడ్డారు. కార్యక్రమాల్లో మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### ఎందుకీ ప్రయోజనం లేని గ్రామసభలు

కుభీర్, జనవరి 22: కుభీర్ మండలంలోని పార్డి(బీ) గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రత్యేకాధికారి విజయకుమార్ ఆదేశంతో పంచాయతీ కార్యదర్శి భూమేశ్ లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. 460కి మించి రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే 50 మందికి మాత్రమే కావడంపై ఎందుకీ ప్రయోజనం లేని గ్రామసభలు.. ఎవరిని ఉద్ధరించేందుకు అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కుభీర్ ఎస్ఐ రవీందర్ అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. మండల ప్రత్యేకాధికారి శంకర్, తహసీల్దార్ అశోక కుమార్, ఎంపీడీవో నవనీత్ కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

ముథోల్, జనవరి 22 : ముథోల్ మండలంలోని గన్నోరా, కారేగాం, తరోడా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. తరోడా గ్రామంలో అర్హులకు రేషన్ కార్డు జాబితాలో పేర్లు రాలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో కాసేపు గందరగోళం నెలకొంది. వెంబడే తహసీల్దార్ శ్రీకాంత్ గ్రామసభకు చేరుకొని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. మళ్లీ యథావిధంగా గ్రామ సభ కొనసాగింది.

దిలావర్‌పూర్ జనవరి 22: దిలావర్‌పూర్ మండలంలోని బన్సపల్లి, సాంగ్వి, కంజర్ గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. బన్సపల్లిలో యువకులు, గ్రామస్తులు, మహిళలు అధికారులను నిలదీశారు. గ్రామసభ గందర గోళంగా మారడంతో దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్ అక్కడి చేరుకున్నారు. రేషన్‌కార్డుల జాబితాను చదివి వినిపిస్తుండగా సంబంధిత శాఖ అధికారి గ్రామస్తులు అర్హులకు కార్డులు రాలేదని నిలదీశారు. అదే విధంగా భూమిలేని పేదలకు ఆత్మీయ భరోసా గురించి కూలీలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితా గురించి చదువుతుండగా మీరు ఎంతమందికి ఇండ్లు ఇస్తారో ముందు చెప్పాలని మహిళలు అధికారులను చుట్టుముట్టారు. సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేని వారు, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అరుణరాణి కోరడంతో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సారంగాపూర్, జనవరి 22: సారంగాపూర్ మండలంలోని కుప్టి, అడెల్లి, చించోలి(బీ), ప్యారమూర్, పొన్‌కూర్, పొట్యా, రాంసింగ్ తండా, రవీంద్రనగర్, యాకర్‌పల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో రేషన్‌కార్డుల లబ్ధిదారులకు పూర్తిగా కార్డులు రాకపోవడంతో ప్రజలు అధికారులను నిలదీశారు.

సోన్, జనవరి 22: నిర్మల్ మండలంలోని అక్కాపూర్‌లో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమానికి ఆర్డీవో రత్నకల్యాణి, ఎంపీడీవో గజానంద్‌రావు హాజరయ్యారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూములు లేని అర్హులైన వారి పేర్లు లేవని అధికారులను నిలదీశారు. వచ్చిన జాబితా కాకుండా గ్రామసభలో ఎంపిక చేసిన పేర్లను చేర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆర్డీవో రత్నకల్యాణి మాట్లాడుతూ ఇది నిరంతర ప్రక్రియని పేర్లు లేనివారు ఇక్కడ ఉన్న కౌంటర్‌లో దరఖాస్తులను అందించాలని కోరారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీఓ తుల రామకృష్ణ, ఏఈఓలు, గ్రామ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించకుంటే ఊరుకోం

గుడిహత్నూర్, జనవరి 22 : గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది, మన్నూర్, గర్కంపేట్, శంభుగూడ, ముత్నూర్ గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. సీతాగోందిలో బ్యానర్‌పై బోథ్ ఎమ్మెల్యే ఫొటో కాని పేరు కనిపించకపోవడంతో మాజీ ఉపసర్పంచ్ సంతోష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బేర దేవన్నతో పాటు యువకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. మళ్లీ ఇలాంటి పొరపాటు జరగకుండా చూస్తామని క్షమించాలని అధికారులు చెప్పడంతో గ్రామసభ కొనసాగింది. బోథ్ నియోజకవర్గ ప్రజలచేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేపై అధికారులు ప్రోటోకాల్ పాటించకుంటే ఊరుకునేది లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్ హెచ్చరించారు. సీతాగోంది, మన్నూర్ గ్రామాల్లో రేషన్‌కార్డులు, ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా జాబితాలో పేర్లు లేకపోవడంతో గ్రామసభలో అర్హుల పేర్లు ఎందుకు లేవని అధికారులను నిలదీశారు.

బజార్‌హత్నూర్, జనవరి 22 : బజార్‌హత్నూర్ మండలంలోని చెందునాయక్ తండాలో నిర్వహించిన గ్రామసభ అధికారులు కేవలం ఐదు నిమిషాల్లో ముగించారు. అర్జీలు పంచాయతీ కార్యదర్శి అందజేయాలని సూచించారు. అంతకు ముందు ప్రోటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే ఫొటో లేకుండా గ్రామసభ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై అధికారులను ప్రజలు నిలదీశారు.

### ప్రోటోకాల్ రగడ..

బోథ్(తలమడుగు), జనవరి 22: తలమడుగు మండలలోని సుంకిడి, రుయ్యాడి, సాయిలింగి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో గందరగోళం నెలకొంది. మూడు గ్రామసభలో ప్రోటోకాల్ ప్రకారం ఫ్లెక్సీలో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఫొటోలు లేకపోవడంతో బీఆర్ఎస్, బీజేపీ, నాయకులు అధికారులను నిలదీశారు. అర్హులైన పేదల పేర్లు జాబితాలో రాలేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో వినోద్, అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే లోకో పైలట్ల నిరసన

ఎదులాపురం, జనవరి 22 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో లాబి ఎదుట ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైల్వే శాఖ లోకో పైలట్ గార్డుకు కిలోమీటర్ అలవెన్స్ 25 శాతం పెంచాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ డిమాండ్ చేశారు. రైల్వే సిబ్బంది అందరికి డీఏ 50 శాతం పెంచి టీఏ సైతం పెంచారన్నారు. కానీ లోకో పైలట్లకు గార్డ్సుకు అన్యాయం చేశారన్నారు. పెంచిన డీఏకు అనుగుణంగా కిలోమీటర్ అలవెన్స్ 25 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అశిష్ రంజన్, సిరాజ్ ఆలం, రింకు కుమార్, డీఎన్ రాజు, హేమంత్ కుమార్, ఆశిష్ దోకే పాల్గొన్నారు.

## అడవి పంది దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

లోకేశ్వరం, జనవరి, 22 : అడవి పంది దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన లోకేశ్వరం మండలం ఎడ్దూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని పంట చేనులో మంగళవారం గొర్రెలను మేపుతున్న నిజామాబాద్ జిల్లా లక్కంపల్లి గ్రామానికి చెందిన శివ సాయిపై అడవిపంది దాడి చేసింది. దీంతో అతడికి తీవ్ర గాయ్యాలయ్యాయి. 108లో నిర్మల్‌లోని ఓ దవఖానకు తరలించారు.

## ఎన్నిసార్లు దరఖాస్తు ఇవ్వాలి

**ఆదిలాబాద్‌లో అధికారుల నిలదీత**


పిట్టల్‌వాడ వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న స్థానికులు

ఆదిలాబాద్, జనవరి 22(నమస్తే తెలంగాణ) : 'ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చాం. కులగణనకు వచ్చిన అధికారులకు వివరాలు అందజేశాం. ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తులు ఇవ్వాలంటూ' ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పిట్టలవాడలో బుధవారం నిర్వహించిన వార్డు సభలో స్థానికులు అధికారులను నిలదీశారు. పేదలు కూలీ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతారని, వారికి రేషన్‌కార్డులు, ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదంటూ అధికారులను ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో మాత్రం పేర్లు లేవని, ఇందుకు కారణం తెలియజేయాలని పట్టుపట్టారు. నామ్‌కే వాస్తేగా సభలు నిర్వహించవద్దని, పేదలకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి దరఖాస్తు ఇవ్వాలని అధికారులు సూచించగా ఎన్నిసార్లు ఇవ్వాలంటూ ప్రశ్నించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బేల, జనవరి 22: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కీర్తన డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పుష్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేలలో విద్యార్థుల కోసం శాంతియూత ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి అధ్యాపకులకు వేతనాలు లేక అద్దె కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపుమేరకు వారం రోజులపాటు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సాగర్, బిందు, సౌందర్య, అమోల్, సంజీవ్, కిష్టారెడ్డి, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలి..

ఆదిలాబాద్, జనవరి 22(నమస్తే తెలంగాణ) : ప్రజాపాలనలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు ఇచ్చినా తమకు రాలేదంటూ ఆదిలాబాద్ పట్టణంలోని 35 వార్డు ప్రజలు స్థానిక ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌తో మొరపెట్టుకున్నారు. బుధవారం వార్డు సభకు హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభకు వచ్చిన వారిలో చాలా మంది తమకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, వార్డు సభలో ప్రచురించిన జాబితాలో తమ పేర్లు లేవంటూ వారు ఎమ్మెల్యేకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ఎలా జరిగిందనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో గ్రామసభలకు హాజరుకావాలని సూచించారు. వార్డు, గ్రామసభలు గందరగోళంగా మారాయని, లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దరఖాస్తుదారులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి నరేందర్, మాజీ ఎంపీపీ గంగారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## సూర్యనగర్‌ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి

బోథ్, జనవరి 22 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సాకేర గ్రామ పంచాయతీ పరిధిలోని సూర్యనగర్ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు బుధవారం నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి విన్నవించారు. జీపీగా ఏర్పాటయ్యేల చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గుండెరావ్, జాదవ్ గోపాల్, రమేశ్, జాదవ్ గోపిచంద్, సొనాల బీఆర్ఎస్ నాయకులు నరేందర్, సురేందర్ రెడ్డి ఉన్నారు.

## ఆదిలాబాద్‌కు రానున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జనవరి 22: రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ ఈ నెల 24వ తేదీన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో మొదటి పర్యటన కొనసాగించనుందని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పడిన రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ 9 మంది సభ్యులతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పర్యటించి రైతు కుటుంబాలతో పాటు రైతులను, రైతు సంఘం నాయకులను కలిసి వారితో సమీక్షించి రైతు సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెంచి రైతులపై రైతు మద్దతుదారులపై అక్రమ కేసులు పెట్టాలని ఆలోచన తప్ప రైతు సంక్షేమంపై దృష్టి సారించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేందుకే రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ రైతులకు మద్దతుగా వారికి అండగా ఉండేందుకు నెలరోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో పర్యటనలు చేయనుందని పేర్కొన్నారు. అందులో భాగంగా మొదటి పర్యటన ఉమ్మడి ఆదిలాబాద్ నుండి ప్రారంభం కానుంది తెలిపారు.

## తమ్ముడు రేప్ కేసులో ఉన్నాడంటూ ఫోన్

- రూ.60 వేలు కావాలంటూ వాట్సాప్ కాల్
- ఏమి ఆలోచించకుండా రూ.30 వేలు ఫోన్ పే చేసిన అన్న..

ఎదులాపురం, జనవరి 22: ఆదిలాబాద్‌లోని తిరుపెల్లికు చెందిన ప్రైవేట్ లెక్చరర్ ఆఫ్రోజ్ ఖాన్ ఈ నెల 16వ తేదీన తనకు ఒక నంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. మీ తమ్ముడు తబ్రెజ్‌ఖాన్ రేప్ కేసులు ఉన్నాడు వెంటనే రూ.60వేలు ఫోన్ పే చేయాలని లేకపోతే జైలుకు పంపిస్తామని బెదిరించారు. నిజమేనని నమ్మి ఆఫ్రోజ్ ఖాన్ ఆయన పంపించిన నంబర్‌కు రూ.10వేలు, 15 వేలు, 5వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. ఆ తర్వాత తమ్ముడు తబ్రెజ్ ఖాన్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగాడు. కాలనీలో వాటర్ పోస్తున్నాను అని సమాధానం చెప్పాడు. సైబర్ నేరగాళ్లు చెప్పిన మాయమాటలు నమ్మి మోసపోయానని గ్రహించాడు. వెంటనే 1093 సైబర్ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆలోపు ఆకౌంట్లో డబ్బును కూడా డ్రా అయినట్లు తెలిసింది. సైబర్ పోలీసులు సూచనల మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ బీ సునీల్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## టేకు చెట్ల నరికివేత నిందితుల అరెస్ట్

ఖానాపూర్ టౌన్, జనవరి 22: ఖానాపూర్ రేంజ్ పరిధిలోని రెండు బీట్ల పరిధిలో 2024 డిసెంబర్ 19వ తేదీన టేకు చెటన్లు నరికి అక్రమంగా రవాణా చేసిన ముగ్గురు నిందితులను బుధవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఖానాపూర్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్వో కిరణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 19వ తేదీన ఖానాపూర్, మస్కాపూర్ బీట్ల పరిధిలో 11 టేకు చెట్లను నరికి వాటిలో కొన్ని దుంగలను వారు ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో అక్రమంగా తరలించారు. ఈ ఘటనలో తమకు అందిన సమాచారంతో పాటు సాంకేతికత ఉపయోగించి కడెం మండలం దోస్తునగర్‌కు చెందిన నగేశ్, మైసంపేట్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, మంచిర్యాలకు చెందిన రాజగోపాల్‌ను బుధవారం జగిత్యాలలో పట్టుకున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు టేకు చెట్ల నరికివేతలో ముఖ్యపాత్ర పోషించారు. ఈ ఘటనలో 12 మంది వరకు పాల్గొన్నట్లు తమకు సమాచారం ఉంది. మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలిస్తామన్నారు. నిందితులు కలప రవాణాకు ఉపయోగించిన కారును సైతం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవి, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## యువతిని మోసం చేసిన యువకుడికి రిమాండ్

బోథ్, జనవరి 22: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన ఓ యువతిని పెళ్లి పేరుతో మోసం చేసిన ఎం వంశీకుమార్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గత కొంత కాలంగా ఓ యువతిని పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి మోసం చేశాడు. అలాగే యువకుని కుటుంబీకులు సత్యనారాయణ, భూలక్ష్మి, లింగారెడ్డి, రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

జైనథ్, జనవరి 22 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంగ్వి గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. తగు చర్యలకు తహసీల్దార్ శ్యాంసుందర్‌కు అప్పగించడం జరిగిందని తెలిపారు.

## యువకుడి రిమాండ్

ఎదులాపురం, జనవరి 22 : బాలికకు మాయమాటలు చెప్పి అపహరించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్ఐ వీ విష్ణువర్ధన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన 14 సంవత్సరాల బాలిక ఈ నెల 20వ తేదీన పాఠశాలకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికిన ఆచూకీ కనిపించలేదు. ఈ నెల 21వ తేదీన కుటుంబీకులు బాలిక కనిపించలేదంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదటగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టగా బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో దొరికింది. ఆ బాలిక వాగ్మూలం రికార్డ్ చేశారు. తలమడుగు మండలానికి చెందిన పదపవన్ కుమార్ (21) మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు పదపవన్ కుమార్‌పై కిడ్నాప్, ఫోక్సో, అత్యాచారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

గుడిహత్నూర్, జనవరి 22 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ఎక్స్‌రోడ్డు సమీపంలోని శ్రీలక్ష్మి జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లులో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సిబ్బంది అత్యవసర అగ్ని నివారణ పైపులైన్ల ద్వారా మంటలు ఆర్పారు. దాంతోపాటు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్ అధికారి జైవంత్‌రావ్ పర్యవేక్షణలో పూర్తిగా మంటలను ఆర్పి వేశారు. యంత్రాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దాదాపు 3 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు జిన్నింగ్ యజమాని వినోద్ అగ్రవాల్ తెలిపారు.

## కొనసాగుతున్న పులి సంరక్షణ చర్యలు

భీంపూర్, జనవరి 22: భీంపూర్ మండలం తాంసి(కే) శివారు అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం నేపథ్యంలో డీఎఫ్‌వో ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది బుధవారం కూడా సంరక్షణ చర్యలు కొనసాగించారు. బుధవారం మధ్యాహ్నం పులి రిజర్వాయర్ ప్రాంతంలో కనిపించిందని అక్కడి కార్మికులు అంటున్నారు. కాగా ఎఫ్ఎస్‌వోలు అహ్మద్‌ఖాన్, మోపతిరావు, ఎఫ్‌బీవోలు సాయి, శ్రీనివాస్, రామేశ్వర్, బేస్ క్యాంపు సిబ్బంది కృష్ణ , సోనేరావ్ సంరక్షణ విధులు నిర్వర్తించారు. నైట్ విజన్ కెమెరాల పరిశీలన చేస్తున్నారు. రైతులు చేన్ల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చవద్దని, నలుగురు ఐదుగురు కలిసి చేన్ల పనులకు వెళ్లాలని అధికారులు అవగాహన కల్పించారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-AII

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677